# కథ మారింది!

**- విమలారామం**

"మామయ్యా....!"

జగన్నాథం ఏమిటన్నట్టు చూసాడు.

సత్యం చూపులు తప్పించుకున్నాడే కాని చెప్పలేదు.

జగన్నాథానికి నవ్వు వచ్చింది. "ఏమిట్రా ఆడపిల్లలా సిగ్గూ అదీను....చెప్పు. ఏం—ఏమన్నా డబ్బు కావాలా?"

"అబ్బే అదికాదు."

"మరేమిటి? చెప్పరా నీ బిడియం బంగారం గాను...."

"ఏంలేదు – సావిత్రిని తీసుకొని సినిమాకి వెడదామని...."

జగన్నాథం ఆశ్చర్యపోయాడు.

"తప్పుగా అడిగానా? ఏదో సరదాగా...."

"అదికాదురా! అసలింతకాలం నీకీ ఆలోచన ఎందుకు రాలేదూ అని?"

సత్యం సిగ్గుపడి పోయాడు.

"ఆరే! రేపు పెళ్ళయ్యాకా ఇలాగే అడుగుతావా? అది నీ చెవులు పట్టుకు ఆడిం చేస్తుందిరోయ్!"

"....ఇంకా అవలేదుగా?"

"ఓహో!....ఉండుండు....నీ పని చెప్తా.... మీ అమ్మకీ నాన్నకీ ఇవ్వాళే ఉత్తరం వ్రాసి...."

"....నేనేం వ్రాయమనటం లేదు."

"కబుర్లు చెప్పకురా!....నీ కెంత తొందరగా ఉందో నీ ముఖం చెప్పటంలే!"

జగన్నాథంతోపాటు షాపులో పనివాళ్ళు అంతా పకపక నవ్వారు.

"ఛ! నేను పోనంతే!" అని ముఖం ముడుచు కొని లోపలికి పోబోయాడు సత్యం.

"నా మీద అలిగితే ఎలాగురా అల్లుడా! వెళ్ళి నీ పెళ్ళాం మీద చూపించు నీ ప్రతాపం..."

"అదిగో మళ్ళీ అదే మాట! అది నా పెళ్ళాం కాలేదింకా అంటుంటే...."

"పోనీలేరా! మళ్ళీ ఈ వారం నాటికి అవుతుంది....సరేనా! ఇక్కడ నాతో వాదనేసుకు కూర్చుంటే అది ఏ ఫ్రెండింటికో చెక్కేస్తుంది. త్వరగా ఇంటికి పరిగెత్తు...."

సత్యం దాదాపు పరిగెత్తే ఇంటికి వచ్చాడు.

సావిత్రి ముస్తాబై ఎక్కడికో వెళ్ళడానికి రెడీగా వుంది. అతన్ని చూస్తూనే కంగారుగా నవ్వు తెచ్చి పెట్టుకుంది. "ఏం బావా! ఎప్పుడూలేంది ఇంత పెందరాళే వచ్చావ్?"

కళ్ళింత చేసుకుంటూ అన్నాడు "నీ కోసమే!"

ఉలిక్కి పడింది సావిత్రి. "నా కోసమా? ఎందుకూ?"

"మినర్వాలో మంచి సినిమా వచ్చిందట... నిన్ను తీసుకు వెడదామని."

"అబ్బ తెలుగు సినిమాలంటే నాకు చచ్చేంత బోరు. నా ఫ్రెండ్‌తో నటరాజ్‌లో 'ఇంగ్లీష్ పిక్చర్'కి వెడుతున్నాను. సారీ బావా! మరే మనుకోకు."

అతను మళ్ళీ నోరు విప్పేలోగా సావిత్రి మెట్లు దిగి హైహీల్డు షూ టకటకలాడించు కుంటూ వెళ్ళిపోయింది.

సత్యం స్థాణువులా నిలబడి పోయాడు.

కాంతమ్మ లోపల్నించి వస్తూ, "....అదేమిటి సత్యం! అదలా నిర్లక్ష్యంగా వెళ్ళిపోతుంటే చూస్తూ ఊరుకున్నావేమిటి?" అంది.

అతను బలవంతంగా నవ్వు తెచ్చి పెట్టు కున్నాడు. "బాగుంది. చదువుకుంటున్న పిల్ల. స్నేహితులుండరాయేం? ఆ మాత్రం స్వతంత్రం లేకపోతే ఎలా?"

"పెళ్ళి చేసుకొని సంసారం చేసుకొనే పిల్లకి ఈ కాలేజీ చదువులెందుకండీ అంటే మామయ్య వినలేదు. ఇప్పుడు చూడు. అదెంత పేట్రేగి పోతోందో? రేపు పెళ్ళయ్యాక నీ మాట వింటుందా అని!"

"నువ్వు బొత్తిగా పాతకాలం మనిషివి అత్తయ్యా! నీ కేం తెలియదు—నువ్వూరుకో!"

"అబ్బాయ్! నీకింత మెతకతనం పనికి రాదు....దాన్నో దార్ని పెడితే కాని...."

సత్యం గలగల నవ్వాడు. "ఏం చేయ మంటావ్ ఇప్పుడు నన్ను"

"తెలుగు సినిమాకి నువ్వడిగితే అదేదో ఇంగిలిపీచు సినిమాకి పోయిందిగా! అలాగే మనతో చెప్పకుండా ఏ వేం చేస్తోందో అని నాకు అనుమానంగా వుంది. నువ్వో పని చెయ్యి. షాపు వదిలి ఎలాగా వచ్చావు. నువ్వూ అదే సినిమాకి వెళ్ళు...."

సత్యం సిగ్గుపడి పోయాడు "ఛ! నాకింగ్లీషు అంత బాగా అర్థం కాదు!"

"వీళ్ళందరికీ అర్థమయిందా? తెలుగు సినిమాల్ని తిట్టటం; అర్థం కాకపోయినా ఇంగ్లీషు సినిమాకి పోయి ఓహోహో – అనటం ఈ నాటో ఫేషనయిపోయింది. నాగరికతయ్యా!....నీకూ నాకూ ఏం తెలుసు?"

"కాని....నేనలా చాటుగా పరీక్షించటానికి వచ్చానని తెలిస్తే తను బాధ పడదూ!"

"పెడదారిని పడుతోందేమో – అది చూడ వలసిన బాధ్యత నీకు లేదూ? ఇలాంటి పిచ్చిపిచ్చి సందేహాలు పెట్టుకోక వెంటనే వెళ్ళు. కనిపెట్టి చూడు....ఒక వేళ నిన్ను చూసిందే అనుకో! నీకేం భయం? నీ టిక్కట్టు పెట్టుకొని నువ్వు వెడుతున్నావు. ఆ హాలు దాని సొంతమాయేం?"

సత్యంకీ వెళ్ళాలనిపించింది.

*

సినిమా 'హాట్ హాట్' గానే ఉంది. ఆమె లేత వ్రేళ్ళను మోటు చేతులు నలిపేస్తున్నాయి. ఆమె చెంపల మీద వెచ్చని పెదాలు ఉండుండి ముద్రలు వేస్తున్నాయి!

"కిషోర్!" మత్తుగా పదే పదే పిలుచు కుంటోంది ఆమె.

"డార్లింగ్!" అతను తన పోర్షన్ వల్లె వేస్తున్నాడు.

"అబ్బ. ఏమిటో ఇదిగా ఉంది....ఒళ్ళంతా ఏదో అయిపోతున్నట్టు........"

"....అలాగే ఉంటుంది! వలపు వేడి అన్నమాట!"

"అబ్బ. ఇక్కడ నీ మాటలు....అక్కడ తెరమీద....ఊ! ఆ పిల్లకి అంత సిగ్గు లేదేమిటి?...."

"ప్రియుడి దగ్గర సిగ్గెందుకు?....మనం కూడా ఎక్కడికైనా వెళ్ళి...."

"ఛట్! ఏమిటా మాటలు?"

అతను కిసుక్కున నవ్వాడు. "మాటలకంటే అవి ఇంకా బాగుంటాయి."

"ష్! ఎవరయినా చూస్తారు."

"పోనీ. టిక్కట్టు లేకుండా మరో సినిమా! లక్కీ ఫెలోస్!"

"ఊఁ! ఇలా చేస్తే–నే పోతానంతే!"

"నన్ను వెంటపెట్టుకొని మరీ పో!..."

అంతలో తెరమీద సీను భయంకరంగా మారిపోయింది. సినిమాతో పాటు వాళ్ళూ సీరియస్‌గా అయిపోయారు.

సినిమా అయిపోయింది. హాలు బయటకు వచ్చాక "....ఇంక వెడతాను కిషోర్!" అంది ఆమె.

"అప్పుడేనా? ఏదయినా హోటలుకి వెళ్ళి...."

"ఉఁ! అప్పుడే తొమ్మిది దాటింది. నే నింటికి వెళ్ళిపోవాలి."

"పోనీ, అలా పార్కుదాకా వెడదాం పద. నీతో రెండు మాటలు చెప్పాలి."

"అంత అర్జంటా?"

"అవును."

పార్కులోకి వచ్చారు. మొక్కల గుబుర్లలో పచ్చిక మీద కూర్చున్నారు. కూర్చున్నదే తడవు అతనమాంతంగా చేతులతో చుట్టబెట్టేసాడు.

బిగి కౌగిలిలో ఆమెకు ఎముకలు విరిగినట్లయింది. ముద్దులవర్షం ఉక్కిరి బిక్కిరి చేసింది.

"కిషోర్! కిషోర్!....ఏమిటిది?....ఎవరైనా ఇటు వస్తారు...."

"డార్లింగ్!....డార్లింగ్! ఒక్కసారి...." అతను వినిపించుకునే స్థితిలో లేడు.

"అదిగో ఎవరో ఇటు వస్తున్నారు!" ఆమె కంఠం వణికింది.

అతను క్షణం నిదానంగా ఆలకించాడు.

ఆకుల చప్పుడు అంతలోనే ఆగిపోయింది.

నవ్వుతూ అన్నాడు. "ఏ ఉడతో అయుంటుంది. అయినా, ఇక్కడ దీపం వెలుగు పడటం లేదు....ఈ మొక్కల చాటున మనం వున్నట్టు ఎవ్వరికీ తెలియదు...."

"ఛ! అర్జంటని చెప్పింది ఇందుకా! ఇంత బరితెగించి పోతున్నావేమిటి? ఇది పబ్లిక్ పార్కు!....ఏ పోలీసయినా చూస్తే....కటకటాల వెనకుంటాం...."

"అప్పుడు మరీ మంచిది....జైలు గదే మన పడక గది అవుతుంది!"

"నీకేం మగవాడివి! ఏమయినా అంటావు. ఏమయినా చేస్తావు!"

"అదేంమాట సావిత్రీ! నీ కిష్టం లేకుండా నేనేం చేస్తాను!....అందుకనే ఏ హోటలుకైనా వెడదాం అన్నాను....చక్కగా గది తీసుకుంటే ఎంత హాయిగా ఉండేది! ఈ రాత్రంతా ఇంత కంటె దగ్గరగా–ఓహ్! స్వర్గం భూమికే దిగి వచ్చుండేది కదూ!"

ఆమె మాట్లాడలేదు.

అతను చెప్పుకుపోతూనే ఉన్నాడు. "ఆ సినిమా చూసాక నీకూ ఎంజోయ్ చేయాలనిపించటం లేదూ? నీ ఒళ్ళిలా హత్తుకు పోతుంటే....కాదనకు.



ఈ క్షణాలు వృథా చేయకు. ఎవరికో భయపడి మనం లైఫ్ ఎంజోయ్ చేయలేం సావిత్రీ!.... ఇలా ఫ్రీ బర్డ్స్‌గా ఉండగానే చక్కగా...."

ఆమె అతని చేతులు త్రోసి వేసింది. "పెళ్ళి చేసుకుంటే ఈ భయాలుండవుగా! ఇలా రహస్యంగా....ఎక్కడ ఎవరు చూస్తారో అని హడలిపోతూ...."

కిషోర్ గలగల నవ్వాడు. "యూ పూర్ డార్లింగ్! ఇలా ఎడ్వంచరస్‌గా అనుభవించటంలోనే వుంది–థ్రిల్! పెళ్ళిచేసుకొని ఇంట్లో అందరికీ తెలిసేలా గదిలోకి వెళ్ళి....ఛ! అందులో మజా ఏముంది?"

"ఏమిటి నీ ఉద్దేశ్యం?" ఈ సారి ఆమె కంఠంలో కంగారులేదు. కోపం తొణికింది.

"జీవితానికో కొత్త అర్థం చెబుతున్నాను."

"నాకీ అర్థాలు–అనర్థాలు వద్దు! మంచిగా మనిద్దరం ఒకటయ్యే మార్గం చూడు!"

"ఏం చేయమంటావ్?"

"అదికూడా నేనే చెప్పాలా?"

"అదికాదు సావిత్రీ! నాకింకా ఆ చదువే పూర్తికాలేదు. ఇప్పుడే నాకు పెళ్ళి చెయ్యి అని వెళ్ళి చెప్పనా?....నా ముఖం వాచేలా చీవాట్లు పెడతాడు–మా నాన్న."

ఆమె వెటకారంగా అంది. "ఇలా పార్కుల్లో రొమాన్సుకేం అభ్యంతరం చెప్పరుకదూ మీ నాన్న?"

"నన్నంటున్నావు కాని....నువ్వు మాత్రం నన్ను ఎంకరేజ్ చేయటంలేదా"?

"ఎవరిది తప్పెక్కువ అని వాదన వేసుకోవల్సిన టైము కాదిది. ఇకముందు ఏ తప్పులూ జరక్కుండా చూడమంటున్నాను...."

"ఏం? నీకంత తొందరగా ఉందా?"

"నీకంతా వేళాకోళం! నేనింట్లో ఎంత అవస్థ పడుతున్నానో నీకేంతెల్సు? ఏదో ఓరోజున ఆ ముహూర్తం పెట్టించేస్తారు! అప్పుడు....?"

"ఎవడువాడు మన ప్రేమ కథలో విలన్....?"

"హీరో మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చుంటే విలనే హీరో అయిపోతాడు. టేక్కేర్!"

"ఎవడికంత గుండెలు!....ఓహో! మీ బావ సత్యవంతుడా? చంచు మొహం వాడూనూ...."

"ఒకళ్ళకి పేర్లెట్టేముందు మనం మంచివాళ్ళ మనిపించుకోవాలి."

"ఏం వాడినంత సైడుచేస్తున్నావ్....వాడంటే ఇష్టం ఉన్నట్టుందే? ఇహనేం....పెళ్ళి వాడ్నే కట్టుకో!"

"పోట్లాట కట్టిపెట్టి అసలు విషయం విను ముందు....ఈ పూట ఏమయిందో తెల్సా? నీ దగ్గరకి వద్దామని బయలుదేరుతుంటే....ఎప్పుడూ లేంది పెందరాళే యింటికి వచ్చాడు. సినిమాకి వెడదాం వస్తావా అన్నాడు."

"నీకంటె నా కిషోర్ ఎక్కువరా వెర్రి బావా... మరోపిల్లని వెతుక్కో అని చెప్పి వచ్చేసావ్–అవునా!"

"ఆమాట త్వరలోనే చెప్తాను....మా నాన్నగారు వచ్చి మీ నాన్నగార్ని అడిగితే–అప్పుడు నువ్వు అవుననడానికి సిద్ధంగా ఉన్నావా?....అది చెప్పు ముందు."

"....ఛ! అప్పుడే మనకి పెళ్ళేంటి డియర్! సరదాగా కొన్నాళ్ళపాటు.... ఇదే ఇటలీలో అయితే...."

"చూడు డియర్! ఇది ఇటలీ కాదు–ఇండియా. అందులో తెలుగు దేశం....ఇక్కడ స్ట్రీట్ రొమాన్సులు అవీ ఇంటికి–ఒంటికి కూడా మంచివికావు. కొంచెం నింగి నుంచి నేలకి దిగి వచ్చి ఆలోచించు .... లేకపోతే, నా మనసు మార్చుకోవాల్సి వస్తుంది!"

"ఓగాడ్! పెద్ద వార్నింగే ఇచ్చేస్తున్నావే! సరే, తప్పుతుందా? అలాగే కానీ!...."

"అయితే, ఒకటి రెండు వారాల్లో రెడీగా ఉండు....బై బై!"

*

రాత్రి బాగా ప్రొద్దు పోయాక వచ్చాడు సత్యం.... కళ్ళల్లో వత్తులు వేసుకుని కూర్చుంది కాంతమ్మ. "ఏం నాయనా ఇంత ఆలశ్యమయింది? అదెప్పుడో వచ్చి పడుకుంది!"

సత్యం నవ్వాడు. "అరే–నాకోసం నిద్ర పోకుండా కూర్చున్నావా? నా చిన్ననాటి స్నేహితుడొకడు కలిసాడు. వాడితో సెకండు షోకి పోయానత్తయ్యా!"

"మరి సావిత్రిని...."

"....లేదు–చూద్దం పడలేదు. సరే నిద్రపో ఇక."

"మరి అన్నం తినవూ?"

"ఉహుం! వాడితో హోటల్లో తినేసాను."

ఆ రాత్రే కాదు-ఆతర్వాత నాలుగు రోజులపాటు ప్రొద్దుపోయి రావటం సాగించాడు సత్యం. గతంలో అల్లుడు మామ లిద్దరూ షాపునుంచి కలిసే ఇంటికి వచ్చేవారు. కాని, ఈమధ్య 'ఏదో పని ఉంది-తర్వాత వస్తాన'ని చెప్పటం-ఆలస్యంగా రావటం....అతను వచ్చేసరికి కాంతమ్మ తప్ప ఇంట్లో అంతా నిద్రపోవటం జరిగేది.

కాంతమ్మ మనస్సు పరిపరి విధాల పోయింది. అతన్ని తరచి తరచి అడగలేక పోయింది. అతని పరిస్థితి ఇంకెవ్వరికీ చెప్పలేదు. తనలో తను తెగ మథన పడిపోయింది.

ఇలా ఉండగా....

ఓనాడు ప్రొద్దున్నే పెట్టె బెడ్డింగు అన్నీ సర్దుక్కూర్చున్నాడు సత్యం.

"....ఎక్కడికి నాయనా ఈ ప్రయాణం?" అని ఆశ్చర్యంగా అడిగింది కాంతమ్మ.

సత్యం ఎటో చూస్తూ అన్నాడు. "మా ఫ్రెండు మరీ మరీ పోరుతున్నాడత్తయ్యా...వాడితో అక్కడ కలిసి వుందామని...."

కాంతమ్మకి మతిపోయినట్లయింది. ఉరుకు పరుగుల మీద దొడ్లో ముఖం కడుక్కుంటున్న జగన్నాధాన్ని లాక్కు వచ్చింది.

"ఎక్కడికిరా అల్లుడా! వెడతానంటున్నావుట?" అని నవ్వాడు జగన్నాధం.

సత్యం ముఖం గంభీరంగా వుంది. "మా ఫ్రెండుతో కలిసి వుందామనుకుంటున్నాను మామయ్యా!"

నిర్ఘాంతపోయాడు జగన్నాధం. "ఏం? ఎందుకని?"

లోపలి గుమ్మంలో బొమ్మలా నిలబడిన సావిత్రి వీళ్ళ మాటలు వింటూనే ఉంది!

"ఏమీ లేదు. ఎంతకాలం మీ యింట్లో పడి తింటాను. నాకూ...."

జగన్నాధానికి కోపం వచ్చింది. "....ఓహో! నీకూ ఒక వ్యాపారముందని మాకు గుర్తు చేస్తున్నావా? ఇంతకీ ఎవరి మీద నీ అలక.... ఏమే వాడినేమన్నా అన్నావా?"

సత్యం కంగారుగా నవ్వాడు. "అబ్బే, నేనెవరి మీదా కోపగించి వెళ్ళటంలేదు మామయ్యా?....

నాకిచ్చిన గౌరవాన్ని ఇలా మిగుల్చుకొని వెళ్ళిపోవటం మంచిదని....''

''సరే, గదీ అదీ చూసుకున్నావా?''

''ఆఁ!''

''అద్దెంత?''

''వంద...''

''అంతా నువ్వేనా ఇచ్చేది – మీ ఫ్రెండేమయినా ఇస్తాడా?''

''ఛ! ఏమిటండీ మీ ప్రశ్నలు–అతనితో పాటు మీకూ మతిపోయిందా?'' అంది కాంతమ్మ చిరాగ్గా.

''ఎంతయినా తనూ వ్యాపారస్తుడు కదే! అంతా లాభనష్టాల బేరీజు వేసుకుంటున్నాడు. నేను మాత్రం చూసుకోవద్దూ? ఇంట్లోంచి వెళ్ళిపోతే అక్కడ గది అద్దెకి–హోటలు భోజనానికి ఎంత అవుతుందో కనుక్కుంటే–ఆ డబ్బుచ్చుకొని ఇంట్లోనే ఓ గది విడిగా యిచ్చి ఉండమందామని....''

''మామయ్యా!''

''అవునురా! అర్ధరాత్రి వచ్చినా అపరాత్రి వచ్చినా నీకు హోటలు వాడు అన్నం పెట్టడు. కాని, మీ అత్తయ్య తను తినే దాంట్లోనయినా నీకు మిగిల్చి ఉంచుతుంది. ఎందుకో తెల్సునా – నువ్వు పరాయి వాళ్ళ కింద చూసినా నువ్వు మాకు అల్లుడివి కనుక!....''

సత్యంకి కళ్ళ నీళ్లు తిరిగాయి. బలవంతంగా ఆపుకున్నాడు.

కాంతమ్మ వచ్చి అతని చేతులు పట్టుకుంది. ''....నువ్విలా వెళ్ళిపోతే నలుగురూ ఏమనుకుంటారు సత్యం! రేపో ఎల్లుండో ముహూర్తాలు పెట్టించుకోటానికి మీ అమ్మ నాన్నల దగ్గరకి మేం వెడదామనుకుంటూంటే యిలా నువ్వు చేయటం నీకు బాగుందా? వాళ్ళకి తెలిస్తే ఎంత బాధపడతారు!''

''ఏమో! వాడికీ పెళ్ళి ఇష్టం లేదేమో!'' జగన్నాధానికి కోపమింకా తగ్గలేదు.

తల త్రిప్పి సావిత్రిని ఒక్కసారి పరీక్షగా చూసాడు సత్యం. ఆమె చటుక్కున తల దించుకొని తలుపు చాటుకి తప్పుకుంది.

''....అవును మామయ్యా! నువ్వు మంచి వాడివి కనుక నా మనసులోని మాట గ్రహించావు. నాకు సావిత్రిని చేసుకోవటం నిజంగానే ఇష్టం లేదు.''

## ఎవరికి తెలుసు?

పుట్టిన బిడ్డ
పట్టుమని
పది రోజులైనా జీవించకుండా
తనువు చాలిస్తే—
ఆ బిడ్డను కన్నతల్లికి
హృదయంలో
అణువణువునా
రగిలే బాధ
ఎవరికి తెలుసు?
ఎవరి బిడ్డను చూసినా
తన బిడ్డతో పోల్చుకుంటూ
పత్తికాయల్లాంటి
తన కళ్ళలో
ఇంకిపోయిన కన్నీళ్ళతో
గుండెలో రగిలే చిచ్చును
లోలోపలే ఆర్పుకుంటూ
ఆ ఆవిర్ల సెగలో
ఆహుతై పోయే
ఆ తల్లి
క్షణ క్షణానికి
అనుభవించే క్షోభ
ఎవరికి తెలుసు??

—కె. సరస్వతమ్మ

''సత్యం!....'' ఇద్దరూ ఒక్కసారే అరిచారు. లోపలున్న సావిత్రి చకితురాలైంది.

కాంతమ్మ కళ్ళు ఎర్రబడ్డాయి. గొంతు బొంగురుపోయింది. ''ఏం నాయనా? అది నీకేం అపకారం చేసిందని?''

''ఒక్క నిమిషం ప్రశాంతంగా ఆలోచించండి అత్తయ్యా! సావిత్రి బి. యే. చదువుతోంది. మరి నేనా స్కూలు ఫైనలుగాడిని. మాకే పెళ్ళయితే వాళ్ళ స్నేహితులు - నా స్నేహితులు అంతా హేళన చేస్తారు....''

''ఈ కుంటి సాకులు చెప్పకురా! ఆ వేళ నిన్నడిగాకనే దాన్ని కాలేజీలో చేర్పించాను.'' అన్నాడు జగన్నాధం.

''అభిప్రాయాలూ – అభిరుచులూ అందరికీ ఎల్లకాలం ఒక్కలాగే ఉండవు మామయ్యా! నన్ను చేసుకోనంత మాత్రాన సావిత్రికేం తక్కువ! అందం ఉంది....చదువు వుంది. అంతో యింతో నువ్వివ్వగలవు! ఇక పెళ్ళి కొడుకులకేం కొదవ?''

''సరే దాని సంగతి బాగానే చెప్పావు. మరి నువ్వు చేసుకుందామనుకుంటున్న పిల్ల విషయం చెప్పు.'' జగన్నాధం వెటకారంగా అన్నాడు.

సత్యం పెద్దగా నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు. ''గంతకు తగ్గ బొంత నాకూ ఒకత్తి ఉంది.''

కాంతమ్మ నిర్ఘాంతపోయింది. సావిత్రికి అదంతా కలలా ఉంది.

జగన్నాధం ముఖం జేవురించింది. ''అయితే ఏర్పాట్లన్నీ అయిపోయాయన్నమాట! నా కొక్క మాట చెప్పకుండా ఇంత చేసావా?రే–మీ నాన్న నాకు గడ్డిపెడితాడురా?''

''ఛ! మీకు మాటొచ్చేలా చేస్తానా మామయ్యా! మా నాన్నకీ, అమ్మకి ఈ సంగతి నేనే చెపుతాను....అన్నట్టు సావిత్రి క్కూడా నేనో మంచి సంబంధం చూశాను!''

వాళ్ళ కంత కంతకీ మతిపోతోంది.

''...వెంకట్రామయ్యగారని లాయరులేరూ!... వాళ్ళబ్బాయి! అతను నా చిన్నప్పటి స్నేహితుడు. బి. ఏ. చదువుతున్నాడు. అందంగా ఉంటాడు–పేరు కూడా మోడ్రన్ గా ఉంటుంది–కిషోర్!....''

సావిత్రికి షాక్ తగిలినట్లయింది. గుండెలు దడదడలాడాయి. ఊపిరి బిగపట్టి వింటోంది.

''ఏమో నాయనా! ఇదంతా చూస్తుంటే నాకు మతిపోతోంది...'' అంటూ అక్కడ్నించి వెళ్ళిపోయింది కాంతమ్మ.

''సరే!....ఎవరికెవరని రాసిపెట్టుందో ఎవరికి తెలుసు! ఇంతదానికి నువ్వింట్లోంచి వెళ్ళిపోవటం ఎందుకు?....అంతగా కలిసుండాలని అనుకుంటే అతనూ మనింట్లోనే ఉంటాడు. నీ స్నేహితుడిని తీసుకురా!'' అంటూ అతని జవాబుకయినా ఎదురు చూడకుండా స్నానానికి వెళ్ళిపోయాడు జగన్నాధం.

అక్కడే ఎంతోసేపు ప్రతిమలా కూర్చుండిపోయాడు సత్యం.

ఎవరో పిల్చినట్లయి–స్పృహలోకి వచ్చాడు. ప్రక్కకి చూస్తే సావిత్రి తలదించుకొని ఉంది.

నవ్వు తెచ్చుకుంటూ అన్నాడు. ''పిలిచావా సావిత్రీ!''

తల పంకించింది ఆమె.

''ఏమిటి?''

''ఒక్కసారి....నా గదిలోకి వస్తావా?''
మాట తడబడింది ఆమెకు.

ఆశ్చర్యంగా ఆమె వెంట నడిచాడు సత్యం.

''కూర్చో!''

సత్యం నవ్వాడు. ''నేను నీకు పరాయివాడిని కాను—నాకీ మర్యాదలేమిటి?''

ఆమె పలకలేదు. ఒకటి రెండుసార్లు చూపులు కలిసాయేకాని, ఆమె గొంతు పెగల్లేదు.

''....చెప్పడానికి సిగ్గుపడుతున్నావా? సందేహిస్తున్నావా?''

''....అదే....అదే నీకు కిషోర్ తెలుసా?''

"తెలియదు!" అతని గొంతు గంభీరంగా ఉంది.

ఉలిక్కిపడింది సావిత్రి. ''మరి? నాన్నతో అలా....''

''నీకు కిషోర్ అంటే ఇష్టమని నాకు తెలుసు. అలా చెప్పటానికి ఆ మాత్రం చాలదూ?''

ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది.

''చూడు సావిత్రీ! నువ్వెవరి మాటల్నీ పట్టించుకోకు. నీ జీవితం నీది. అది నీ యిష్టం వచ్చినట్టు అనుభవించే హక్కు నీకుంది. నీకతను నచ్చాడు. అతడినే చేసుకో!....మీ యిద్దరికీ పెళ్ళి జరిగేలా చూసే బాధ్యత నాది! సరేనా?''

అప్రయత్నంగా సావిత్రి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ''నిన్నెంత అపార్థం చేసుకున్నాను! నన్ను క్షమించు బావా!''

అతను నిండుగా నవ్వాడు. ''పిచ్చిదానా! మనలో మనకి క్షమాపణలేమిటి!''....చటుక్కున హాల్లోకి వచ్చి తన సూటుకేసు తెరిచి చిన్న పెట్టొకటి పట్టుకొని ఆమె గదిలోకి వచ్చాడు.

''ఇది నీ పెళ్ళికి ప్రెజెంట్ చేద్దామని కొన్నాను సావిత్రీ!....''అంటూ పెట్టె తెరచాడు.

సావిత్రి కళ్ళు జిగేల్‌మన్నాయి.

''అప్పుడో రాళ్ళ నెక్లెసు చేయించమని నువ్వత్తయ్యని అడగటం విన్నాను. అదేదో నీకు నేనే చేయించాలనుకున్నాను. పెళ్ళప్పుడు నిన్ను సర్ప్రయిజ్ చేద్దామని — ఇంతవరకు ఎవ్వరికీ చెప్పలేదు....ఎప్పుడయితేనేం? ఇప్పుడే పెట్టుకో!'' అని ఆమెకు అందించాడు.

''ఇప్పుడు నా కెందుకిది?....''

''ఏం? నీకు కానుక ఇచ్చే అర్హతయినా లేదా నాకు?'' అతని కంఠం గాద్గదికమయింది.

''అదికాదు బావా! నిన్ను పెళ్ళి చేసుకొనే ఆమె కోసం చేయించినది....''

అతను పేలవంగా నవ్వాడు. ''....అబ్బో! అదెప్పటి మాటో!...ఇంకా ఎక్కడయినా పుట్టిందో లేదో! వెతకాలి!''

నిరుత్తరురాలయింది సావిత్రి. ''మరి నాన్నతో అలా చెప్పావేం?''

ఆమెవైపు జాలిగా చూశాడతను. ''చూడు సావిత్రీ! నేనేం చెప్పినా—ఏం చేసినా నేను కోరుకొనే దొక్కటే—నీ సంతోషం ... నీ సుఖం! అంతకంటె నాకీ జీవితంలో ఏవీ ఎక్కువ కావు. నేనిది ఇచ్చినట్టు ఎవ్వరికీ చెప్పొద్దు. నా సంతోషం కోసం నువ్వు పెట్టుకో! నీ నుంచి ఇంకేం అడగను. ప్లీజ్!''

ఆమె గుక్క త్రిప్పుకోటానికి ముందే సత్యం గది విడిచి వెళ్ళిపోయాడు.

*

"హలో డార్లింగ్! ఏమిటి క్లాసులెగగొట్టి అర్జంటుగా రమ్మన్నావు?....ఇంత ప్రొద్దున్నే లవ్ సిక్‌నెస్సా!'' అంటూ ఆమె చుట్టూ చేతులు వేశాడతను.

ఆ చేతులు విదిలించుకుంటూ, ''....కాంటీన్‌కి పద! నీతో మాట్లాడాలి.'' అంది ఆమె.

''ఫైన్! ఇవాళ మెరిసిపోతున్నావు....ఏమిటి విశేషం?''

''కనపడ్డంలా?'' వెటకారంగా అంది ఆమె.

''అదే! బ్యూటిఫుల్ నెక్లెస్! నీ హొయలు.... నీ వొంపులు ఇవన్నీ చూస్తుంటే నిన్ను కిడ్నేప్ చేసెయ్యాలనిపిస్తోంది!''

''నీకదేం ఖర్మం! పెళ్ళి చేసుకొని ఇంటికి తీసుకుపొమ్మంటే?''

''ఏదీ మీ నాన్నగారింకా మా యింటికి రాందే!....అందాకా నేనిలా విరహగీతం పాడుకుంటూ....వెన్నెలరాత్రుళ్ళను తిట్టుకుంటూ....''

''ఛట్! ఇది పట్టపగలు—కాంటీన్‌లో కూడా ఈ పైత్యం ఏమిటి?....''

"ఓ ఐసీ!....ఏదీ ఒక పది నోటిలా పడెయ్!"

ఆమె ముఖం ఎర్రబడింది. ''ఇన్నాళ్ళూ నా దగ్గర ముందే తీసుకొని నువ్వు పెద్ద బిల్లు చెల్లించినట్టు పోజుకొట్టావ్....ఇకనయినా నీ జేబులోంచి తియ్యి!''

అతను గలగల నవ్వాడు ''....అందులో సరుకుంటేగా? ఏమిటివేళ కొత్తగా అడుగుతున్నావు?''

''లేదు కిషోర్! సీరియస్‌గానే అంటున్నాను. కేంటీన్ బిల్లునేకాదు....ఇవాళ అర్జంటుగా నాకు వంద రూపాయిలు కావాలి. అందుకే పిలిచాను. నువ్వు తప్ప నాకిచ్చేవాళ్ళు లేరు!''

కిషోర్ తెల్లబోయాడు. ''నేనెక్కడ్నించి తేను? మా నాన్న ఒక్క రూపాయి—యివ్వటానికే గంట క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తాడు!''

''ఏమో నా కదేం తెలియదు! ఇన్నాళ్ళూ నువ్వడగ్గానే లెక్క, పత్రం లేకుండా ఎంత కావాలంటే అంత యిచ్చాను. అన్ని వందల్లో ఒక్కటంటే ఒక్కటి ఇవ్వలేవా? అవసరం వచ్చి అడుగుతున్నా!''

కిషోర్ బలవంతంగా నవ్వాడు. ''అదికాదు సావిత్రీ!....''

''....ఏదికాదు? ఇవ్వగలవా—లేదా? ఆ సంగతి చెప్పు. లేదంటే నోర్మూసుకు పోతాను....''

''....ఎక్కడ్నించితేను?....నాకిచ్చేవాళ్ళేరీ?''

''నాకున్నట్టే నీకూ ఉన్నారు — ఎటొచ్చీ సహాయంచేసే గుణం ఉందోలేదో ఇక తెలియాలి!''

''పోనీ....ఓ పని చేస్తే?...నాకు తెల్సిన మార్వాడీ ఒకడున్నాడు. అట్టే వడ్డీ పుచ్చుకోడు. వాడిదగ్గర నీ నెక్లెసు పెడదాం. ప్రస్తుతానికి పని జరుగుతుంది. ఆ తర్వాత నీకు వీలయినప్పుడు యిచ్చి తెచ్చుకుందాం! ఎలా ఉంది ఐడియా?''

అంతే! కిషోర్ చెంప ఛెళ్ళుమంది.

''ఇప్పుడు నీ ముఖం ఎలా వుందో అద్దంలో చూస్కో — అలాగే వుంది నీ ఐడియాకూడాను. యూ బ్రూట్! నీ అసలు రంగు బయట పెడదామనే ఇలా అడిగాను. ఇకనయినా ఒళ్ళు దగ్గర పెట్టుకొని మరీ మసులుకో! మైడియర్ ఫ్రెండ్! నీకో బేడ్ న్యూస్—ఈ నెక్లెసు నాకెవరిచ్చారో తెలుసా!....నువ్వు చుంచుముఖం అన్నావే — అతనే—మా బావ! నాకు పెళ్ళికానుకగా పెట్టాడు. నీలాంటి దర్టీరోగ్‌కన్న అతను వెయ్యి రెట్లు నయం! గుడ్ బై!....''

కేంటీన్‌లో కిషోర్‌తో సహా అందరూ తెల్లమొహాలు వేసుకొని చూస్తుండగా సావిత్రి విసవిసా నడిచి వెళ్ళిపోయింది!